క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

అనంతగిరి: వికారాబాద్ మండల పరిధిలోని 33కేవీ మదన్‌పల్లి ఫీడర్ నుండు మరమ్మతు కారణంగా ఆదివారం ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మదన్‌పల్లి, గిరిగేట్‌పల్లి సబ్‌స్టేషన్‌కు విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీ సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఇఫ్తార్ విందు నేడు

ఆహ్వానించిన శుభప్రద్ పటేల్

తాండూరు టౌన్: తాండూరు పరిధిలోని ముస్లింలకు ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ఏఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నేటి సాయంత్రం ఇఫ్తార్ విందు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కావున ముస్లింలు అందరూ విచ్చేసి ఆతిథ్యాన్ని స్వీకరించాలని ఆయన కోరారు.

వీధి నాటకానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

దోమ: మండల కేంద్రంలో జరిగిన వీధి నాటకానికి డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి విరాళం అందజేశారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రానికి వచ్చిన ఆయన.. కళాకారులు ప్రదర్శించిన శ్రీ వేంకటేశ్వర స్వామి మహత్యం వీధి నాటకాన్ని వీక్షించి, రూ.31 వేలు విరాళంగా అందజేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, జెడ్పీటీసీ నాగిరెడ్డి, స్థానిక సర్పంచ్ రాజిరెడ్డి నాటక ప్రదర్శకులకు రూ.30 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ యాదయ్య గౌడ్, ఎంపీటీసీ రాంలాల్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, సలీం, జనార్దన్‌గౌడ్, ముస్తఫ, అఖిల్, మొగులయ్య, అభిగౌడ్ పాల్గొన్నారు.

11న సర్వసభ్య సమావేశం

బంట్వారం: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 11న మండల పరిషత్ కార్యాలయంలో జరగనుందని ఎంపీడీఓ బాలయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలన్నారు.

మూడున్నర దశాబ్దాలుగా అంబలి పంపిణీ

కొడంగల్ రూరల్: ప్రతి వేసవి కాలంలో అంబలి పంపిణీ చేస్తూ ప్రజా సేవలో నిమగ్నమయ్యారు హస్నాబాద్ వీరభద్రేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు. మూడున్నర దశాబ్దాలకు పైగా దాతలు ఇచ్చే జొన్నలు, శనగలు తదితర వాటితో అంబలి తయారుచేస్తూ.. ఉదయం పంపిణీ చేస్తారు. అంబలి సేవించడంతో ఆరోగ్యంతో పాటు మనసు ఉల్లాసంగా ఉంటుందని నిర్వాహకులు చెప్పారు.

మానవ హక్కుల కోసం పోరాటం



నియామకపత్రం అందుకుంటున్న అజయ్‌కుమార్

పరిగి: ప్రజలకు అందుబాటులో ఉంటూ.. నిరంతరం న్యాయం కోసం పోరాటం చేస్తానని, మానవ హక్కులను కాపాడుతూ.. వారి హక్కుల గురించి అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు అజయ్‌కుమార్ చెప్పారు. అధ్యక్షుడిగా నియామకం అయిన ఆయన.. జాతీయ అధ్యక్షుడు అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

శ్మశానవాటికను దున్నేశారు..

ధారూరు: రుద్రారం గ్రామం సర్వే నంబర్ 3లోని శ్మశానవాటికను కొందరు వ్యక్తులు దున్నేశారని గ్రామస్తులు శనివారం కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్‌లకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన అంతయ్య, పోచయ్య, గోపాల్, నందు, శ్రీకాంత్ తదితరులు సమాధులను తొవ్వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. శ్మశాన వాటికను దున్నిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

పెద్దేముల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్ఎంసీ చైర్మన్ రాములు అన్నారు. జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో సత్తా చాటిన మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులను పాఠశాల చైర్మన్ రాములు, ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు శాలువాతో సన్మానం చేసి, జ్ఞాపికలు అందజేశారు.

సబ్సిడీ సాగు పనిముట్లకు మంగళం

ఆధునిక వ్యవసాయం ప్రశ్నార్థకంగా మారింది. సాంకేతికత, యాంత్రీకరణ పరిజ్ఞానం ఆశించిన స్థాయిలో అన్నదాతలకు అందడం లేదు. దీంతో మారుతున్న కాలానికి అనుగుణంగా తక్కువ పెట్టుబడితో సాగు చేసి, అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాఖ చేస్తున్న ప్రచారం కార్యరూపం దాల్చడం లేదు.

- కనుమరుగవుతున్న రాయితీ పథకాలు
- ఏళ్లు గడుస్తున్నా నేటికీ అందని పరిస్థితి
- ఇబ్బందుల్లో అన్నదాతలు
- మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలం

దోమ: వ్యవసాయ రాయితీ పథకాలు ఒక్కొక్కటిగా కనుమరుగవుతుండడంతో అన్నదాతల ఆశలు అడియాశలుగానే మిగిలిపోతున్నాయి. అదేవిధంగా వ్యవసాయ యాంత్రీకరణ పథకాల మంజూరును ప్రభుత్వం పక్కన పెట్టడంతో కర్షకుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. దీంతో సబ్సిడీ పరికరాలు ఈ ఏడాదైనా అందుతాయని రైతన్నలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

అందని పరికరాలు

మండలంలో అధిక శాతం రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నవారే.. మొత్తం 36 జీపీలో 19 వేల మంది రైతులు సాగుచేస్తున్నారు. గతంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉపయోగపడే రోటోవేటర్, కల్టివేటర్, తైవాన్ పంపులు, మినీ ట్రాక్టర్లు, టార్పాలిన్ కవర్లతో పాటు తదితర వ్యవసాయ పనిముట్లను ప్రభుత్వం సబ్సిడీ ద్వారా పంపిణీ చేసేది. ప్రస్తుత పరిస్థితుల్లో రాయితీపై అందజేసే పనిముట్లు అందకపోవడంతో రైతులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ప్రభుత్వం నూతన యాంత్రీకరణ పరికరాలను మంజూరు చేయడంలో పూర్తిగా విఫలమైందని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

నిలిచిన పథకాలు

రాయితీ పరికరాలు ఒక్కొక్కటిగా 2006–07 నుంచి నిలిచిపోయాయి. సాగులో రైతులకు ఎక్కువగా ఉపయోగపడే నాగళ్లు, తదితర పనిముట్లు 2014లోనే కనుమరుగయ్యాయి. దీంతో రైతులు పంట పొలాల్లో కాడెద్దులతో పని చేసుకుంటున్నారు. ఎడ్లతో పని చేయడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. 2016–17 ఆర్థిక సంవత్సరం వరకు అందుబాటులో ఉన్న పనిముట్లు.. ఆ తర్వాత పూర్తిగా మాయమయ్యాయి. దీంతో ఐదేళ్లుగా అప్పు చేసి, పరికరాలు కొనుగోలు చేసి వ్యవసాయం చేసుకుంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వచ్చే వానాకాలం నాటికి సాగు పరికరాలను అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కాడెడ్లతో పొలాన్ని చదును చేస్తున్న రైతు

రాయితీ పరికరాలు ఇవ్వాలి



గత ప్రభుత్వాలు రైతులకు సబ్సిడీపై పరికరాలను ఏటా అందిస్తుండేవి. ఐదేళ్లుగా అవి లేక అవస్థలు పడుతున్నాం. వ్యవసాయానికి కావాల్సిన పనిముట్లు లేక.. అప్పులు తెచ్చి అధిక ధరలకు కొనుగోలు చేసుకుంటూ సాగు చేస్తున్నాం. ప్రతి సంవత్సరం ఇవే ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం స్పందించి రాయితీ పరికరాలు అందజేయాలి.

– వెంకటయ్య, రైతు బొంపల్లి

వస్తే పంపిణీ చేస్తాం..



ఇప్పటి వరకు ఎలాంటి సబ్సిడీ పరికరాలు రాలేదు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీ పరికరాలు అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి పనిముట్లు రావడం లేదు. దీంతో వారు ఇబ్బంది పడుతున్నారు. ఈ ఏడాది నుంచి రాయితీ పరికరాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వస్తే తప్పనిసరిగా రైతులకు పంపిణీ చేస్తాం.

– ప్రభాకర్ రావు, వ్యవసాయ అధికారి, దోమ

రేపటి నుంచి పల్లెపల్లెకు పైలెట్

తాండూరు రూరల్: మండలంలో సోమవారం నుంచి పల్లెపల్లెకు పైలెట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3, 4,5,6 తేదీల్లో ప్రతి గ్రామంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తారని చెప్పారు. కావున అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. 3న సంకిరెడ్డిపల్లిలో ప్రారంభమై.. 6వ తేది రాత్రి ఎల్మకన్నెలో ముగుస్తుందని ప్రకటించారు.

చిన్నారులకు అన్న ప్రాసన



అన్న ప్రాసన చేస్తున్న సర్పంచ్ అనిత

కొడంగల్: మండల పరిధిలోని అన్నారం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు శనివారం అన్న ప్రాసన చేశారు. పోషన పక్షోత్సవాల సందర్భంగా అన్న ప్రసాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిత, సూపర్‌వైజర్ ప్రభావతి, రుద్రారం సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లు అరుణ, సంతోష, ఆశ కార్యకర్తలు భాగ్యమ్మ, చంద్రకళ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా



ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు, నాయకులు

- పెండింగ్ వేతనాలు, పీఆర్సీకి ప్రాధాన్యత
- ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి
- ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన మున్సిపల్ కార్మికులు

తాండూరు టౌన్: కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, వారి పెండింగ్ వేతనాలు, పీఆర్సీ అమలుకు అధిక ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి చెప్పారు. మున్సిపల్ బడ్జెట్ సమావేశాలు నిర్వహించేలా కృషి చేసినందుకు.. మున్సిపల్ కార్మికులు ఎమ్మెల్యేను బీఆర్ఎస్ కార్మిక విభాగం ఆధ్వర్యంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఏడాది కాలంగా నిలిచిపోయినా మున్సిపల్ బడ్జెట్ సమావేశాలు నిర్వహించేలా చేశారని, దీంతో నిలిచిన తమ వేతనాల చెల్లింపు ప్రక్రియ సులభతరమైందని కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సోమవారం ప్రవేశ పెట్టనున్న బడ్జెట్ సమావేశాల్లో కార్మికుల పెండింగ్ వేతనాలు, 30 శాతం పీఆర్సీ అమలుకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులు, కార్మికులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఆర్ఎస్ కార్మిక విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు గోపాల్, ఎంఐఎం కౌన్సిలర్ బాంబిన, కార్మిక నాయకులు ప్రకాష్, నరేష్, బలరాం, లాలప్ప, ఆశన్న, నిర్మల, ఆనందమ్మ ఉన్నారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

- అరగంట ముందే ఎగ్జామ్ సెంటర్‌కు చేరుకోవాలి
- రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు
- మండల విద్యాధికారులు

పెద్దేముల్: ఈ నెల 3నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు పూర్తి చేశామని పెద్దేముల్ మండల ఇన్‌చార్జి ఎంఈఓ వెంకటయ్య శనివారం తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఫ్యాన్స్, తాగునీటి, వైద్య సేవలతో పాటు అన్ని వసతులు కల్పిస్తామని చెప్పారు. మండలంలోని పెద్దేముల్ బాలుర ఉన్నత పాఠశాలలో–217, బాలికల ఉన్నత పాఠశాలలో–188, మంబాపూర్ ఉన్నత పాఠశాలల్లో–205 మొత్తం 610 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందని, పరీక్షకు వచ్చే విద్యార్థులు 30 నిమిషాల ముందే కేంద్రానికి చేరుకోవాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని, ఎగ్జామ్ టైంలో కేంద్రాల పరిధిలోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయిస్తామని పేర్కొన్నారు. మూడు పరీక్ష కేంద్రాల్లో 32 మంది ఇన్విజిలేటర్లు, ఆరుగురు పరీక్ష నిర్వాహక అధికారులను నియమించినట్లు చెప్పారు.

11 కేంద్రాలు.. 2,440 మంది విద్యార్థులు

తాండూరు రూరల్: తాండూరు పట్టణం, మండలం కలిపి పదో తరగతి పరీక్షలకు విద్యాధికారులు అంతా సిద్ధం చేశారు. సోమవారం నుంచి టెన్త్ ఎగ్జామ్స్ ప్రారంభం కానుండగా.. మండలంలో ఏర్పాటు చేసిన 11 పరీక్ష కేంద్రాల్లో 2,440 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు అధికారులు తెలిపారు. కరన్‌కోట్, మల్కాపూర్‌ల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, కావున విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పరీక్ష రాయాలని ఎంఈఓ సూచించారు.

ఏర్పాట్లు పూర్తి

పరిగి: రేపటి నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యాధికారి హరిశ్చందర్‌నాయక్ చెప్పారు. పట్టణ కేంద్రంలోని 8 పరీక్ష కేంద్రాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా మొత్తం 1,730 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. 8 పరీక్ష కేంద్రాల్లో 122 మంది ఇన్విజిలేటర్లు, 8 మంది చీఫ్ సూపరింటెండెంట్లను నియమించినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చామని, వాటి పర్యవేక్షణలోనే ప్రశ్న పత్రాల బండల్స్‌ను ఓపెన్ చేస్తామని వెల్లడించారు.



పరిగి: పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంఈఓ హరిశ్చందర్ తదితరులు

రాహుల్ గాంధీ అంటే మోదీకి భయం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

- ప్రజాస్పందన చూసి ఓర్వలేకే లోక్‌సభకు దూరం చేసిన కేంద్రం
- డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి

కుల్కచర్ల: రాహుల్ గాంధీపై లోక్‌సభలో అనర్హత వేటు వేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అవినీతిని ప్రశ్నించడం మొదలు.. రాహుల్ పాదయాత్రకు వచ్చిన స్పందన చూసి మోదీ భయాందోళనకు గురయ్యారని, ఆ భయంతోనే చట్టసభల్లో రాహుల్ ఉండకుండా చేశారని విమర్శించారు. కేవలం కిందిస్థాయి కోర్టు ఇచ్చిన తీర్పును పార్లమెంట్‌స్థాయిలో ప్రాతిపదికగా తీసుకోవడం అవివేకమని ఎద్దేవా చేశారు. దేశ ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో నిరంకుశ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని చెప్పారు. కార్యక్రమంలో కుల్కచర్ల ఎంపీటీసీ ఆనందం, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, జిల్లా రజక సంఘం ప్రధాన కార్యదర్శి మోత్కూరు వెంకటేష్, నాయకులు నర్సింహులు, ఘనపూర్ భరత్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి బైండోవర్

పెద్దేముల్: తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి ఎదుట ఎక్సైజ్ పోలీసులు శనివారం ఇద్దరు వ్యక్తులను బైండోవర్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దేముల్ మండలం సిద్దన్న మడుగు తండాలో శనివారం ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో తండాకు చెందిన సోనిబాయి, బలరాం ఇంట్లో రెండు లీటర్ల బెల్లం ఊట లభించగా.. దాన్ని స్వాధీనం చేసుకొని, ఆ ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి ఎదుట హాజరుపరిచామని కానిస్టేబుల్ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన సారా తయారు చేయడం నేరమని, మరోసారి సారా క్రయవిక్రయాలు జరిపితే చట్ట పరమైన చర్య తీసుకోవడంతో పాటు జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.



తహసీల్దార్ ఎదుట ఇద్దరిని బైండోవర్ చేసిన ఎక్సైజ్ పోలీసులు

అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి



పరిగి: సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

- ప్రజలకు అన్ని వసతులు కల్పిస్తున్న ప్రభుత్వం
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డులో రూ.5 లక్షల నిధులతో సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. మార్కెట్ యార్డులోని రైతులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామీణ, పట్టణాల సమస్యలు పరిష్కరించారని, ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్ రావు, దోమ జెడ్పీటీసీ నాగిరెడ్డి, పీసీఎస్‌వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలోనే అభివృద్ధి

పూడూరు: తెలంగాణ ప్రభుత్వ హయాంలోనే మారుమూల గ్రామాలు అభివృద్ధి చెందాయని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. రూ.2 కోట్ల నిధులతో నిర్మించ తలపెట్టిన కంకల్–పూడుగుర్తి గ్రామాలకు వెళ్లే బ్రిడ్జి పనులకు భూమిపూజ చేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే పల్లెలకు బీటీరోడ్లు, అంతర్గత సీసీరోడ్లు వేయించడం జరిగిందని తెలిపారు. ప్రతి నెలా నిధులను పంచాయతీ ఖాతాల్లో జమచేసి, మౌలిక సదుపాయాలు కల్పించామని, అనేక సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ మేఘమాల, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజహరుద్దీన్, పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, రైతు సమితీ మండల అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, మండల వైస్ ఎంపీపీ మైపాల్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణపడి ఉంటాం.. ఆదుకోండి

- ఉపాధి కల్పిస్తున్నవారిని విస్మరించడం సరికాదు
- ఉపాధిహామీ ఉద్యోగులకు పేస్కేల్ వర్తింపజేయాలి
- ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగులు
- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేత



ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధిహామీ ఉద్యోగులు

కొడంగల్ రూరల్: ఉపాధిహామీ ఉద్యోగులకు పేస్కేల్ అమలు చేసి ఆదుకోవాలని ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గ్రామీణ నిరుపేదలకు ఉపాధి కల్పిస్తున్న ఉద్యోగులను విస్మరించడం తగదని, గ్రామీణాభివృద్ధి శాఖలో పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగులకు అమలు చేస్తున్న విధంగానే రెండో విభాగంలో పనిచేస్తున్న తమకు పేస్కేల్ విధానాన్ని వర్తింపజేయాలని పేర్కొన్నారు. తమను గుర్తిస్తే.. ప్రభుత్వానికి రుణపడి ఉంటామని చెప్పారు.

15ఏళ్లుగా ఒకే పోస్టు, ఒకే ఉద్యోగం..

2006లో ఉపాధిహామీ అమలుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రత్యేక కమిటీ ద్వారా కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యోగులను తీసుకున్నారని, 2008లో గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ద్వారా ఫిక్స్‌డ్ టెన్యూర్ ఉద్యోగులు(ఎఫ్‌టీఈ)గా మార్చారని ఉపాధి ఉద్యోగులు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న హరితహారం, పల్లెప్రగతి, వ్యవసాయ అనుబంధ పనుల్లో భాగంగా చెరువులు, కుంటల్లో పూడికతీత తదితర పనులు చేయిస్తూ.. కీలకపాత్ర పోషిస్తున్నామని వెల్లడించారు. 15ఏళ్ల గా ఒకే పోస్టు, ఒకే ఉద్యోగంతో పనిచేస్తున్నామని, రాష్ట్రంలో వివిధ హోదాల్లో 3,874మంది కాంట్రాక్ట్ ఉద్యోగులుగా ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లో పనిచేస్తున్నామని, తమకు పేస్కేల్ అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పట్నం స్పందిస్తూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి సమస్య తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు ఉపాధి ఉద్యోగులు చెప్పారు.

కార్యదర్శులకు న్యాయం చేయాలి

కొడంగల్: పంచాయతీ కార్యదర్శులను ఆదుకోవాలని నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల పంచాయతీ కార్యదర్శులు శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను పర్మినెంట్ చేయాలని, సస్పెండ్ అయిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మూడు మండలాల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు కొండయ్య, అశోక్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

పథకం ప్రారంభం నుంచి..



ఉపాధిహామీ పథకం ప్రారంభం నుంచి పనిచేస్తున్నాను. రోస్టర్ పాయింట్ ద్వారా జిల్లా కమిటీ ఎంపిక చేసింది. చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్నాం. రాష్ట్రంలో 3,874మంది ఉద్యోగులు వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. పేస్కేల్ అమలు చేస్తే ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– రాములు, ఉపాధిహామీ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు

మాయమాటలతో కాలయాపన!

- రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదు
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. ఏకకాలంలో రుణమాఫీ
- జోడో యాత్రలో డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్ రెడ్డి, నేతలు



కుల్కచర్ల: చాకల్‌పల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న టీఆర్ఆర్

కుల్కచర్ల: రాష్ట్ర ప్రభుత్వం మాయమాటలు చెప్పి కాలయాపన చేయడం తప్పిస్తే.. పేద ప్రజలకు, రైతులకు ఒరగబెట్టిందేమీ లేదని, రుణమాఫీ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్.. పాలన కాలం పూర్తికావస్తున్నా నేటికీ ఆ ఊసే లేదని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్ రెడ్డి విమర్శించారు. శనివారం చౌడాపూర్ మండల పరిధిలోని చాకల్‌పల్లి, మేగ్యానాయక్ తండా, మొగుళ్లపల్లిలో నిర్వహించిన హాత్ సే హాత్ జోడో యాత్రలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మోసపూరిత ప్రకటనలు చేయడం తప్పిస్తే.. వాస్తవరూపంలో ప్రజలకు ఎటువంటి మేలు జరగడం లేదని, కేవలం కొందరికి మాత్రమే మేలు జరిగే కొన్ని పథకాలను అమలుచేయడం జరుగుతోందని ఆరోపించారు. పేద ప్రజలకు సంక్షేమ పథకాల ఫలితాలు అందాలన్నా.. వారు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని చెప్పారు. అధికారంలోకి వస్తే.. ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయడంతో పాటు.. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న ధరణి వ్యవస్థను తొలగిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్, స్థానిక సర్పంచ్ రాములమ్మ, నాయకులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హాత్‌సే హాత్ జోడో యాత్ర నిర్వహించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు గౌడ్, నాయకులు వెంకట్రాములు గౌడ్, రాజేశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహులు నాయుడు, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.